www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 215, శనివారం 5-9-2026 ఎడిటర్ : చెంగపాంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

### కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం!



5 లో..

### బ్లీచింగ్ సరఫరా చేశారు... బిల్లుకు సున్నం పెట్టారు!



3వ పేజీల్లో

# హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌పై సీఎం కీలక ఆదేశాలు

> "హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలి. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలకు ఎలాంటి రాజీ ఉండకూడదు. విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధికి ఈ హబ్ కీలకంగా మారాలి. వర్షపు నీటి సంరక్షణ, పచ్చదనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దాలి."

## హకీంపేట్‌లో సీఎం రేవంత్ పర్యటన

**నిర్మాణాల నాణ్యతపై ప్రత్యేక ఆదేశాలు**

**విద్యా సంస్థలు, ఆసుపత్రి భవనాల తనిఖీ**

**వర్షపు నీటి సంరక్షణకు ప్రణాళికలు**



**హకీంపేట్, సెప్టెంబర్ 4 :**

రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వివిధ విద్యా సంస్థల నిర్మాణ పనులను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ అధికారులకు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని పేర్కొంటూ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లో భాగంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల, వెటర్నరీ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల భవనాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అలాగే 400 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఆసుపత్రి భవన సముదాయంతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, హాస్టళ్ల నిర్మాణాలను కూడా తనిఖీ చేశారు. ప్రతి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో జరుగుతున్న అన్ని నిర్మాణ పనులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ శాఖల అధికారులు సమిష్టిగా పనిచేస్తేనే ప్రాజెక్టు నిర్దేశిత గడువులో పూర్తవుతుందని పేర్కొన్నారు. సాంకేతిక అంశాలు, భద్రతా ప్రమాణాలు, నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

మిగతా 2లో

## కొండా సురేఖ తొలగింపు బాధాకరమే..

### కానీ పార్టీ క్రమశిక్షణే ముఖ్యం: మహేశ్ కుమార్ గౌడ్

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించబోమన్న టీపీసీసీ చీఫ్

సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన ఏఐసీసీ

అంతర్గత వేదికలు ఉండగా మీడియా ముందుకు రావడం సరికాదన్న వ్యాఖ్య

కాంగ్రెస్‌లోనే కొనసాగితే భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని సూచన

2లో



## స్వచ్ఛ ఆటో కార్మికుల ఉపాధికి భంగం కలిగించొద్దు..

### కల్వకుంట్ల కవిత

**బంజారాహిల్స్‌లో కార్మికులతో సమావేశం**

**చెత్త సేకరణ వ్యవస్థలో మార్పులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కవిత**

**కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తామని హెచ్చరిక**

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**

బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయంలో స్వచ్ఛ ఆటో కార్మికులతో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు తమ ఉపాధికి సంబంధించి ఎదురవుతున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. చెత్త సేకరణ వ్యవస్థలో ప్రతిపాదిత మార్పుల వల్ల వేలాది మంది కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, నగరంలో స్వయం ఉపాధి ద్వారా జీవనం సాగిస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికుల ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేశారు.

మిగతా 2లో






## బీఆర్ఎస్ విమర్శలకు మంత్రి సీతక్క కౌంటర్

'పచ్చ కాంగ్రెస్' వ్యాఖ్యలు హాస్యాస్పదమని వ్యాఖ్య

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతిపక్షాల వైఖరిని తప్పుబట్టిన మంత్రి

వ్యక్తిగత దూషణలు, కించపరిచే రాజకీయాలను సహించబోమని హెచ్చరిక

**ములుగు, సెప్టెంబర్ 4 :**

ఇతర రాజకీయ పార్టీల నుంచి వచ్చిన నాయకులతో బీఆర్ఎస్ నిండిపోయి ఉండగా కాంగ్రెస్‌ను 'పచ్చ కాంగ్రెస్'గా అభివర్ణించడం హాస్యాస్పదమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క విమర్శించారు. ములుగులో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆమె, ఇతర పార్టీల నాయకులను పెద్ద ఎత్తున చేర్చుకున్న బీఆర్ఎస్‌కు ఇలాంటి విమర్శలు చేసే నైతిక హక్కు లేదన్నారు. కేటీఆర్ ఇతర పార్టీల గురించి మాట్లాడే ముందు తమ పార్టీ చరిత్రను పరిశీలించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్‌లోకి ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు లేరా అని ప్రశ్నించిన మంత్రి, ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి వచ్చిన వారిని బట్టి రాజకీయ ప్రమాణాలు మారవని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో

## గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు..

### మంత్రి పొన్నం ప్రభాకర్

- యూనియన్ ప్రతినిధులతో సమావేశమైన రవాణా శాఖ మంత్రి
- యాప్ ఆధారిత రవాణా రంగ సమస్యలపై వినతి
- డ్రైవర్ల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యమన్న మంత్రి

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**

గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు శుక్రవారం మంత్రి క్వార్టర్స్‌లో ఆయనను కలిసి ఆటో, క్యాబ్, యాప్ ఆధారిత రవాణా రంగానికి సంబంధించిన పలు సమస్యలను వివరించారు.

మిగతా 2లో



# హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌పై సీఎం కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)



ప్రతి దశలో పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎడ్యుకేషన్ హబ్ పరిధిలో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని సేకరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. భవిష్యత్తులో నీటి వనరుల పరిరక్షణకు ఇది ఉపయోగపడటమే కాకుండా, ల్యాండ్‌స్కేపింగ్ పనులకు కూడా వర్షపు నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు.
పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా హరితాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించేలా విశాలమైన పచ్చదనం, ఆధునిక మౌలిక సదుపాయాలు, సౌకర్యవంతమైన హాస్టల్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ఒకే వేదికగా హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాజెక్టుల పురోగతి, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌ను ఆదర్శవంతమైన విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# కొండా సురేఖ తొలగింపు బాధాకరమే..

## కానీ పార్టీ క్రమశిక్షణే ముఖ్యం: మహేశ్ కుమార్ గౌడ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 :



తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం వ్యక్తిగతంగా బాధ కలిగించేదేనని పేర్కొంటూనే, పార్టీ క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ నియమాలను ఉల్లంఘించే వారిపై ఎంతటి స్థాయిలో ఉన్న నాయకులైనా చర్యలు తప్పవని, కాంగ్రెస్ అధిష్ఠానం క్రమశిక్షణ విషయంలో రాజీ పడదని తేల్చి చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు.
కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన వ్యాఖ్యలను ఏఐసీసీ తీవ్రంగా పరిగణించిందని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఆ వ్యాఖ్యలను కొండా సురేఖ వెంటనే ఖండించకపోవడం కూడా అధిష్ఠానం దృష్టికి వెళ్లిందన్నారు. ఈ వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ సమగ్ర నివేదిక అందించగా, దాని ఆధారంగానే చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే అంశాలపై అధిష్ఠానం కఠిన వైఖరితో వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.
పార్టీలో ఏవైనా అభిప్రాయ భేదాలు లేదా సమస్యలు ఉంటే వాటిని చర్చించేందుకు అనేక అంతర్గత వేదికలు అందుబాటులో ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు వంటి నాయకులతో చర్చించే అవకాశం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో పార్టీ వ్యవహారాలను బహిరంగంగా మీడియా ముందుకు తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. పార్టీ క్రమశిక్షణను దెబ్బతీసే చర్యలను సహించబోమని హెచ్చరించారు.
"కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు పాటించాల్సిందే. క్రమశిక్షణను అతిక్రమిస్తే చర్యలు అనివార్యం" అని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అయితే కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకురాలని, ఆమె పార్టీని వీడకుండా కొనసాగాలని తాను కోరుకుంటున్నానని తెలిపారు. పార్టీ పట్ల నిబద్ధతతో కొనసాగితే భవిత్తులో అవకాశాలు తప్పకుండా వస్తాయని సూచించారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలిపై వచ్చిన ఆరోపణలను కూడా మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా క్మెయిల్ చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించిందని, వ్యక్తిగత రాజకీయాలకు తావు లేదన్నారు. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని వివరించారు.
అలాగే భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీ బీసీ వర్గాలకు తగిన ప్రాధాన కల్పిస్తుందని ఆయన హామీ ఇచ్చా సామాజిక న్యాయం, సమాన అవకాశాల విషయంలో పార్టీ కట్టుబడి ఉందన్నా వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన పరిణామం తెలంగాణ రాజకీయా విస్తృత చర్చకు దారితీసిన నేపథ్యం మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# స్వచ్ఛ ఆటో కార్మికుల ఉపాధికి భంగం కలిగించొద్దు..

(మొదటి పేజీ తరువాయి)



ఇంటింటికీ చెత్త సేకరిస్తూ నగర పరిశుభ్రతకు తోడ్పడుతున్న కార్మికుల ఉపాధికి భంగం కలిగించే నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల వేలాది కుటుంబాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని అన్నారు.
ప్రస్తుతం చెత్త సేకరణ సేవల ద్వారా ఉపాధి పొందుతున్న కార్మికులను ప్రైవేట్ సంస్థల ఆధీనంలో పనిచేసే ఉద్యోగులుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని కవిత పేర్కొన్నారు. స్వయం ఉపాధితో గౌరవప్రదంగా జీవిస్తున్న కార్మికుల ఆర్థిక భద్రతకు భంగం కలగకుండా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. చెత్త సేకరణకు సంబంధించిన చార్జీలను ఆస్తి పన్నుతో అనుసంధానం చేసే ప్రతిపాదనలపై కూడా కవిత ప్రశ్నలు లేవనెత్తారు. ఈ విధానం అమలైతే ప్రస్తుత వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని అన్నారు. నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సంక్షేమం, ఉపాధి భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.
స్వచ్ఛ ఆటో కార్మికులు నగర పరిశుభ్రతకు విశేష సేవలు అందిస్తున్నారని కవిత కొనియాడారు. వారికి తగిన భద్రతా చర్యలు, బీమా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. డంపింగ్ యార్డుల వద్ద కనీస మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని, కార్మికుల పనివాతావరణాన్ని మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలని కవిత డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు, ఉపాధి పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్మికులకు అన్యాయం జరిగితే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# బీఆర్ఎస్ విమర్శలకు మంత్రి సీతక్క కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)



మీ పార్టీలోకి వస్తే పవిత్రులు, ఇతర పార్టీల్లో ఉంటే అనైతికులా అనే ప్రశ్నను ఆమె లేవనెత్తారు. రాజకీయ విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, ద్వంద్వ వైఖరికి తావు ఉండకూడదన్నారు.
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని సీతక్క ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలకు వివరించాలని మంత్రి డిమాండ్ చేశారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చేసిన హామీల పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించే ముందు తమ పాలనపై సమాధానం చెప్పాలని సూచించారు.
ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై లెక్కలతో సహా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. రైతు రుణమాఫీ, పంట బోనస్, ఉద్యోగాల భర్తీ, మహిళా సంక్షేమ కార్యక్రమాలు వంటి అంశాలపై బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. అదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసి మేలు ఏమిటో కూడా ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాలు హుందాగా, గౌరవప్రదంగా ఉండాలని సీతక్క అన్నారు. వ్యక్తిగత దూషణలు, కించపరిచే పోస్టర్లు, అవమానకర రాజకీయాలను సహించబోమని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విమర్శలు సహజమే అయినా, వ్యక్తిగత స్థాయి దిగజారి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తే ప్రజాస్వామ్యబద్ధంగానే గట్టి సమాధానం ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు..

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను యూనియన్ ప్రతినిధులు అభినందించారు. 2012 తర్వాత ఆటో ఛార్జీల పెంపుపై ప్రభుత్వం ముందడుగు వేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయాలు, ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రవాణా రంగ కార్మికులకు మరింత సహాయం అవసరమని పేర్కొన్నారు.
మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలను త్వరితగతిన అమలు చేయాలని యూనియన్ ప్రతినిధులు కోరారు. యాప్ ఆధారిత రవాణా సేవల్లో పనిచేస్తున్న ఆటో, క్యాబ్, సరుకు రవాణా వాహనాల డ్రైవర్లకు న్యాయం జరిగేలా స్పష్టమైన నిబంధనలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. రంగంలో పారదర్శకత, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఓలా, ఉబెర్, రాపిడో, పోర్టర్ వంటి యాప్ ఆధారిత రవాణా సంస్థలపై నియంత్రణకు సంబంధించి మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు-2025ను సమర్థవంతంగా అమలు చేయాలని యూనియన్ ప్రతినిధులు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించే కనీస బేస్ ఛార్జీ, కిలోమీటర్ ఛార్జీ, నిమిషం ఛార్జీలను తప్పనిసరిగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీని వల్ల డ్రైవర్ల ఆదాయం మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు.
యాప్ ఆధారిత ప్రయాణీకుల, సరుకుల రవాణాకు ఉపయోగించే ప్రైవేట్ వాహనాల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కూడా యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అవసరమైన చోట మోటార్ వెహికల్స్ చట్టం-1988 ప్రకారం వాణిజ్య రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయాలని కోరారు. అలాగే పెరుగుతున్న ఇంధన ధరలు, వాహన నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని హైర్ వెహికల్ ఛార్జీల పెంపుపై కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రతినిధులు సమర్పించిన అంశాలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటో, క్యాబ్, గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకునేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. డ్రైవర్ల ప్రయోజనాలను పరిరక్షించడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందేలా రవాణా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.






# ఐఎస్ఓఐ జాతీయ సదస్సుకు మంత్రి దామోదర్ శ్రీకారం

- హైదరాబాద్‌లో 32వ వార్షిక జాతీయ సదస్సు ప్రారంభం
- ఆధునిక దంత వైద్యంలో ఇంప్లాంటాలజీ కీలకమన్న మంత్రి
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో దంత సేవల విస్తరణకు చర్యలు
- ఓరల్ క్యాన్సర్ నివారణపై ప్రత్యేక దృష్టి అవసరం

హైదరాబాద్, సెప్టెంబర్ 4 :

ఇండియన్ సొసైటీ ఆఫ్ ఓరల్ ఇంప్లాంటాలజిస్ట్స్ (ఐఎస్ఓఐ) 32వ వార్షిక జాతీయ సదస్సును ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఘనంగా ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి హాజరైన దంత వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు, పరిశోధకులను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. ఆధునిక వైద్య రంగంలో ఓరల్ ఇంప్లాంటాలజీ ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొంటూ, ప్రజలకు నాణ్యమైన దంత వైద్య సేవలు అందించడంలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఓరల్ ఇంప్లాంటాలజీ కేవలం కోల్పోయిన దంతాలను భర్తీ చేసే ప్రక్రియ మాత్రమే కాదని, రోగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచే సమగ్ర వైద్య విధానమని మంత్రి వివరించారు. నమలే సామర్థ్యాన్ని పునరుద్ధరించడంతో పాటు సౌందర్యాన్ని పెంపొందించడం, ఆత్మవిశ్వాసాన్ని తిరిగి కల్పించడం వంటి అనేక ప్రయోజనాలు ఇంప్లాంట్ డెంటిస్ట్రీ ద్వారా సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఈ వైద్య విధానం దంత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత మెరుగైన దంత వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా దంత వైద్య సేవలను విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ క్రమంలో సుమారు 50 మంది డెంటల్ డాక్టర్ల నియామక ప్రక్రియను చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమానంగా నాణ్యమైన దంత చికిత్స అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశంలోనే కాకుండా తెలంగాణలో కూడా ఓరల్ క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నివారణ, ముందస్తు గుర్తింపుపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం, ఇతర అనారోగ్యకర అలవాట్ల కారణంగా నోటి క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స విజయవంతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.
ప్రజల్లో నోటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంలో దంత వైద్యులు కీలక బాధ్యత వహించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన దంత సంరక్షణ పద్ధతులు, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నోటి ఆరోగ్యాన్ని సాధారణ ఆరోగ్యంతో అనుసంధానం చేసి సమాజంలో ఆరోగ్య చైతన్యం పెంచాలని కోరారు. ఈ జాతీయ సదస్సు ద్వారా దంత వైద్య రంగంలోని తాజా సాంకేతికతలు, పరిశోధన ఫలితాలు, ఆధునిక చికిత్సా విధానాలపై వైద్య నిపుణులకు విస్తృత చర్చలు జరిగే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి సదస్సులు వైద్యుల నైపుణ్యాలను మరింత పెంపొందించడమే కాకుండా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా దంత వైద్య రంగ అభివృద్ధికి ఈ సదస్సు ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# విజిలెన్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**- అవినీతి నిర్మూలనతోనే సంస్థలో పారదర్శకత, ప్రజల్లో విశ్వాసం**







**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 4, (భద్రాద్రి న్యూస్):** సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని వీకేసీఎం వద్ద కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆధ్వర్యంలో శుక్రవారం విజిలెన్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు అవినీతి నిర్మూలన, పారదర్శకత, నిజాయితీ, అవినీతి నిరోధక చర్యలపై అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులు సూచించారు. అవినీతి సంస్థ అభివృద్ధికే కాకుండా సమాజ పురోగతికి కూడా అడ్డంకిగా మారుతుందని, దాని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఉద్యోగులు నిష్పక్షపాతంగా, నిజాయితీగా విధులు నిర్వహించడం ద్వారా సంస్థపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించాలని అధికారులు సూచించారు. అలాగే సీఎం పిఎఫ్ పథకాలు, ఉద్యోగులకు అందుతున్న ప్రయోజనాలు, ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించిన సేవలు, వాటిలో పారదర్శకత ప్రాధాన్యతపై కూడా అవగాహన కల్పించారు. ఉద్యోగులు తమకు అందుబాటులో ఉన్న అధికారిక సమాచారాన్ని వినియోగించుకోవాలని, ఎలాంటి విషయాల్లోనూ మధ్యవర్తులను ఆశ్రయించకుండా సంబంధిత అధికారులను నేరుగా సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కమిషనర్లు వంశీధర్, కనకమ్మ, అసిస్టెంట్ కమిషనర్ చిరంజీవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సులోచన, శ్రీనివాస్, వీకేసీఎం మేనేజర్ మురళి, ఏఐటీయూసీ రిప్రెజెంటేటివ్ హీరాలాల్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ గోపు కుమారస్వామి, సీఎం పిఎఫ్ అధికారులు, సింగరేణి అధికారులు, వీకేసీఎం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శిరీష కుటుంబానికి అండగా నిలవాలి

**- కోటి పరిహారం.. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి**
**- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**






**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 4 (భద్రాద్రిన్యూస్ ):-** శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి కోటి రూపాయల నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ములకలపల్లి మండలం చౌటిగూడెంలో శిరీష కుటుంబాన్ని శుక్రవారం కూనంనేని పరామర్శించి, ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. శిరీష పనిచేసిన ఆస్పత్రిలో సరైన భద్రతా వసతులు లేకపోవడంపై చర్యలు తీసుకోవాలని డీజీపీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ తరపున శిరీష దశదిన కర్మలకు మూడు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, మేయర్ మూడ గణేష్, నరాటి ప్రసాద్, యండి యూసుఫ్, నరాటి రమేష్, పువ్వాల లలితారావు, అనుముల సాయి, వీరూనాయక్, రంజిత్, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

# ఇంటింటా పిల్లల సందడి..

**- కొత్తగూడెంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు**
**- ఉట్లు కొట్టి.. ఊరేగించి..**
**- కృష్ణుడికి ప్రత్యేక పూజలు**









**కొత్తగూడెం, సెప్టెంబర్ 4 (భద్రాద్రి న్యూస్):-** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు, యువత ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ప్రధాన కూడలిలో సంప్రదాయబద్ధంగా ఉట్ల పండుగ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. జన్మాష్టమి సందర్భంగా పట్టణంలోని ప్రతి ఇంటా చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి తల్లిదండ్రులు ఆనందాన్ని పంచుకున్నారు. ముద్దొచ్చే చిన్నారులు బుడిబుడి అడుగులతో సందడి చేస్తూ, వెన్న ముద్దలు తింటూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు, గోపికల వేషాల్లో బాలికలు ఒకరినొకరు అనుసరిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో జన్మాష్టమి వేడుకలను జరుపుకున్నారు.

# బ్లీచింగ్ సరఫరా చేశారు... బిల్లుకు సున్నం పెట్టారు!

*- బోనకల్ మేజర్ పంచాయతీలో రూ.1,02,500 బకాయిల బాగోతం?*
*- మూడు నెలలుగా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారంటూ సరఫరాదారు ఆవేదన*
*- రికార్డులు బయటపెడితే అసలు నిజాలు తేలుతాయంటూ కిషోర్ డిమాండ్*




**భద్రాద్రి న్యూస్ ప్రతినిధి(మోదుగు ఇమ్మానుయేల్) :** బోనకల్ మేజర్ గ్రామపంచాయతీ అవసరాల కోసం బ్లీచింగ్ సున్నం సరఫరా చేశామని, ప్రతి విడత సరఫరాకు సంబంధించి కార్యాలయ సిబ్బంది సంతకాలు కూడా తీసుకున్నామని.. అయితే బిల్లులు చెల్లించే సమయానికి మాత్రం కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆర్ఎస్ ఎంటర్‌ప్రైజెస్, ఖమ్మం ప్రతినిధి పి.కిషోర్ ఆరోపించారు. తనకు రావాల్సిన సుమారు రూ.1,02,500 బకాయిలను చెల్లించకుండా మూడు నెలలుగా జాప్యం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వివరాల్లోకి వెళితే.. 2024లో బోనకల్ మేజర్ గ్రామపంచాయతీకి బ్లీచింగ్ సున్నం సరఫరా చేసేందుకు అప్పటి కార్యదర్శి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంగీకారం కుదిరిందని కిషోర్ తెలిపారు. అందుకు అనుగుణంగా పలు దఫాలుగా బ్లీచింగ్ సున్నం సరఫరా చేశామని, సరఫరా చేసిన ప్రతిసారీ కార్యాలయ సిబ్బంది నుంచి స్వీకరణకు సంబంధించిన సంతకాలు తీసుకున్నామని పేర్కొన్నారు.

అయితే సరఫరా చేసిన సామగ్రికి సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని గత మూడు నెలలుగా ప్రస్తుత కార్యదర్శిని కోరుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని కిషోర్ ఆరోపించారు. ఇప్పటికే సుమారు రెండేళ్లుగా బకాయిల కోసం ఎదురుచూస్తున్నామని, పలు గ్రామపంచాయతీలకు పెండింగ్ బిల్లులు వచ్చినప్పటికీ తమ బిల్లును మాత్రం చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, తమ విషయంలో మాత్రం చెల్లింపు జరగడం లేదని ఆయన పేర్కొన్నారు.

**సరఫరా చేశాననే ఆధారాలున్నా.. బిల్లు ఎందుకు నిలిపారు?**

సరఫరాకు సంబంధించిన రికార్డులు, సిబ్బంది సంతకాలు తన వద్ద ఉన్నాయని కిషోర్ చెబుతున్నారు. సామగ్రి సరఫరా జరగలేదంటే కార్యాలయ రికార్డుల్లో ఉన్న సిబ్బంది సంతకాలు ఎవరివని ఆయన ప్రశ్నిస్తున్నారు. సామగ్రి స్వీకరణ వివరాలు, స్టాక్ రిజిస్టర్‌లో నమోదైన అంశాలు ఏమయ్యాయని నిలదీశారు.

అప్పటి కార్యదర్శి కిరణ్‌కుమార్‌తో ప్రస్తుత కార్యదర్శి, సర్పంచ్ ఫోన్‌లో మాట్లాడినప్పటికీ, అనంతరం గత కార్యదర్శి తమకు తెలియకుండా కార్యాలయానికి వచ్చి కొన్ని వివరాలు రాసి వెళ్లినట్లు చెబుతున్నారని కిషోర్ ఆరోపించారు. తనకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ఇలా జాప్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

**రికార్డులు తెరిస్తే.. లెక్క తేలాల్సిందే!**

గ్రామపంచాయతీకి సరఫరా చేసిన బ్లీచింగ్ సున్నం వివరాలతో పాటు స్టాక్ రిజిస్టర్, ఇన్‌వర్డ్ రిజిస్టర్, సరఫరా రశీదులు, సిబ్బంది సంతకాలు, బిల్లుల వివరాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తే అసలు విషయం వెలుగులోకి వస్తుందని కిషోర్ అన్నారు.

ప్రభుత్వ కార్యాలయానికి సరఫరా చేసిన సామగ్రికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉంటే అందుకు కారణమేంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బిల్లుల చెల్లింపుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని లిఖితపూర్వకంగా ఎందుకు తెలియజేయడం లేదని ప్రశ్నించారు.

**బిల్లులు చెల్లిస్తారా.. విచారణ చేస్తారా?**

బోనకల్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బ్లీచింగ్ సున్నం సరఫరాకు సంబంధించిన పూర్తి రికార్డులను ఉన్నతాధికారులు పరిశీలించాలని కిషోర్ కోరారు. తనకు రావాల్సిన సుమారు రూ.1,02,500 బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సరఫరా తీసుకుని.. బిల్లు చెల్లించకుండా కార్యాలయం చుట్టూ తిప్పడం ఎందుకు? రికార్డులు ఉన్నప్పుడు చెల్లింపును అడ్డుకుంటున్నది ఎవరు?” అని కిషోర్ ప్రశ్నించారు.

ఈ వ్యవహారంలో గ్రామపంచాయతీ రికార్డులు, బిల్లులు, సరఫరా వివరాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

**కార్యదర్శి వివరణ**

ఈ విషయమై ప్రస్తుత బోనకల్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ కార్యదర్శి రాజేశ్వరిని వివరణ కోరగా, గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ బదిలీపై వెళ్లే సమయంలో కార్యాలయ బాధ్యతలు అప్పగిస్తూ రూపొందించిన చార్జ్‌షీట్‌లో ఈ అంశానికి సంబంధించి ఎలాంటి బకాయి ఉన్నట్లు నమోదు చేయలేదని తెలిపారు. చార్జ్‌షీట్‌లో బకాయి వివరాలు లేకపోవడంతో ప్రస్తుతం ఈ అంశంపై తమకు పూర్తి సమాచారం లేదని ఆమె పేర్కొన్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించిన అనంతరం వాస్తవాలు వెల్లడవుతాయని తెలిపారు.

# ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహానికి స్థలం కేటాయించండి

*- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి ప్రజా సంఘాల వినతి*



**వరంగల్, సెప్టెంబర్ 4( భద్రాద్రిన్యూస్ ):** హన్మకొండ జిల్లా కేంద్రంలో ప్రజాయుద్ధ నౌఖ గద్దరన్న విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ప్రజా సంఘాల నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని వెంటనే ఎమ్మెల్యే ఫార్వర్డ్ చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో గద్దరన్న పాత్ర కీలకమైందని అలాంటి గద్దరన్న ఆశయ సాధనలో భాగంగా ఆయన విగ్రహాలను రాష్ట్రమంతా ఏర్పాటు చేసుకొని పీడిత ప్రజల విముక్తిలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గద్దర్ విగ్రహ స్థాపన కమిటి చైర్మన్ కోంద్ర నర్సింగరావు, బిసి జాక్ నాయకులు డాక్టర్ తిరునహరి శేషు, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డి బి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, గజాల గోవర్ధన్, గద్దర్ సాంబయ్య, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో బాబు జగ్జీవన్ రామ్ మనవడు

**- విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి హాజరైన డాక్టర్ అన్షాల్ అభిజిత్**



**పాల్వంచ, సెప్టెంబర్ 4 (భద్రాద్రి న్యూస్):** భారత మాజీ ఉప ప్రధాని, ప్రముఖ దళిత నేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ మనవడు డాక్టర్ అన్షాల్ అభిజిత్ శుక్రవారం పాల్వంచ పట్టణానికి విచ్చేశారు. పట్టణంలో నిర్వహిస్తున్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవంలో పాల్గొనేందుకు ఆయన పాల్వంచకు వచ్చిన సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు డాక్టర్ అన్షాల్ అభిజిత్‌ను పలువురు నాయకులు కలిసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు, సామాజిక సమానత్వం, దళితుల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. డాక్టర్ అన్షాల్ అభిజిత్ ఏఐసీసీ జాతీయ కాంగ్రెస్ ప్రతినిధిగా, డాక్టరేట్ . విద్యార్హతలు కలిగి ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్, దళిత రత్న దండోరా శీను, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దాసరి సారథి, ఎం ఎస్ ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి రొడ్డ రమేష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బైరి రవికుమార్, సీపీఐ నాయకులు మనోజ్ కోరి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల మోసాలపై ప్రజా పోరాటం: కందాళ




**నేలకొండపల్లి, సెప్టెంబర్ 4 (భద్రాద్రి న్యూస్):** నేలకొండపల్లి గ్రామంలోని పీఎస్ఆర్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్య పాలనకు నిరసనగా నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో మహిళలు, వృద్ధులు, వికలాంగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి గారు ఆరోపించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రూ.2,500 మహిళా ఆర్థిక సాయం, రూ.500 గ్యాస్ సిలిండర్, తులం బంగారం, వికలాంగులకు రూ.6,000 పెన్షన్ వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పాలేరు ప్రాంత రైతుల పంటలను కాపాడేందుకు నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత విమర్శలు మాని ప్రజలకు మంచి పాలన అందించాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటంలో ప్రజలకు అండగా ఉంటానని కందాళ ఉపేందర్ రెడ్డి గారు స్పష్టం చేశారు.

# లైన్స్ క్లబ్ అవని ఆధ్వర్యంలో గొడుగు పంపిణీ




**వైరా, సెప్టెంబర్ 4,( భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ పాత బస్టాండ్ ఏరియాలో శుక్రవారం పాదరక్షకులు కొట్టుకుంటూ జీవనం సాగిస్తూ గడుపుతున్న నిరుపేద వ్యక్తికి ఎండకి ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్న అతనికి వాటిని తట్టుకునే విధంగా లైన్స్ క్లబ్ మహిళ సభ్యులు గొడుగును అందించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ అవని అధ్యక్షురాలు గద్ద నీరజ, సెక్రెటరీ సుగ్గల మాధవి మాట్లాడుతూ అవని క్లబ్ ఆధ్వర్యంలో ఈరోజు అందిస్తున్నామని గొడుగు ఎండకు,వానకు కూడా, రెండు రకాలుగా ఉపయోగపడే విధంగా ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకొని గొడుగును ఉపయోగించుకోవాలని లేని పక్షంలో రిటర్న్ తీసుకొని వేరే వారికి అందిస్తామని కూడా ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అవని క్లబ్ సభ్యులు పువ్వాడ జయశ్రీ, రాయల విజయలక్ష్మి, గుడ్ల శేషు, వడ్లమూడి విజయలక్ష్మి, రీసన్స్ సెక్రెటరీ వై బుచ్చి రామారావు, లైన్స్ క్లబ్ ఆఫ్ వైరా ఉపాధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, మిట్టపల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## చారుగుండ్ల రాజశేఖర్ అభినందనీయుడు



**కోదాడ, సెప్టెంబర్ 4(భద్రాద్రి న్యూస్):** ఉపాధ్యాయ వృత్తికే అంకితమై ఒకపక్క ఉపాధ్యాయులుగా అక్షర సేద్యం చేస్తూ మరొకపక్క ప్రవృత్తిగా మానసిక వికాసానికి దోహదం చేస్తున్న చారు గుండ్ల రాజశేఖర్ అభినందనీయుడు వీరు ఐదు లక్షల మంది విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పాఠాలు ఉచితంగా నిర్వహించారు 45 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు. 2010 నుంచి విజయీభవ ప్రతిభ అవార్డుల పేరిట వెయ్యి మంది విద్యార్థులు పదో తరగతి ప్రభుత్వ పాఠశాల చదివినటువంటి విద్యార్థులకు ప్రోత్సహిస్తూ వస్తున్నారు వీరి సేవలకు మెచ్చి తెలంగాణ ప్రభుత్వము ఇటీవల జపాన్ విద్యా పరిస్థితుల అధ్యయనానికి డెలిగేటుగా పంపించింది వీరికి రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి పురస్కారాలను పొంది ఉన్నారు.

## ఆరు గ్యారెంటీలు.. అన్నీ గాలిమాటలే!

### – దమ్మపేటలో బీఆర్ఎస్ ‘వంటా--వార్పు’ నిరసన



**దమ్మపేట భద్రాద్రి న్యూస్ సెప్టెంబర్ 4:**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణ విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యాలను నిరసిస్తూ దమ్మపేట ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ‘వంటా--వార్పు’ కార్యక్రమం నిర్వహించారు. కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మెచ్చా ఆరోపించారు. వృద్ధుల పింఛన్లు, రైతుబంధు, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఉప్పల వెంకటరమణ మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గురుపూజోత్సవానికి సర్వం సిద్ధం

### -- నేడే ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం





**కామేపల్లి,సెప్టెంబర్ 4(భద్రాద్రి న్యూస్):** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కామేపల్లి మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు శనివారం ఘనంగా సన్మాన మహోత్సవం జరగనుంది. ముచ్చర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 1:30 గంటలకు ఈ వేడుక నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ, అధికారి జి.వెంకట్ విలేఖరి సమావేశంలో తెలిపారు ఆయన మాట్లాడుతూ..
?సమాజ వికాసానికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేసిన 10 మంది మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను, అలాగే గత ఏడాది జిల్లా స్థాయి పురస్కారాలు పొందిన ఇద్దరు ఉపాధ్యాయులను ఈ వేదికపై ప్రత్యేకంగా సత్కరించి గౌరవించనున్నారు. ?ఈ సన్మాన కార్యక్రమానికి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ అధికారులు ప్రతి పాఠశాల నుంచి 50 శాతం మంది ఉపాధ్యాయులు విధిగా హాజరై జయప్రదం చేయాలని ఎంఈఓ కోరారు. చదువులకు ఏ సమస్యలు కలగకుండా మిగతా తోటి ఉపాధ్యాయులు పాఠశాలల్లోనే ఉంటూ బోధనా కార్యకలాపాలు యథావిధిగా కొనసాగించాలని ఆదేశించారు.

## వైరా సాయిబాబా మందిరంలో కుంకుమ పూజలు



**వైరా, సెప్టెంబర్ 4, (భద్రాద్రి న్యూస్):** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ సాయి నగర్ లో ఉన్న షిరిడి సాయిబాబా మందిరంలో శ్రావణ శుక్రవారం రోజున కమిటీ వారి ఆధ్వర్యంలో మందిర అర్చకులు రంగుబట్ల ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహిళలకు కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా మందిరములో కుంకుమ పూజలు నిర్వహిస్తున్నామని శ్రావణ శుక్రవారం రోజున రెండు వందల మందికి పైగా మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు అని మందిర కమిటీ సభ్యులు తెలియజేశారు.

## కామేపల్లి లో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమీ వేడుకలు



**కామేపల్లి సెప్టెంబర్ 4 (భద్రాద్రి న్యూస్):** మండల కేంద్రమైన కామేపల్లి గురు మందిరంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు లోక కళ్యాణం కోసం జరుపుకునే ఈ ఉత్సవాలు సందర్భంగా తొలుత రుక్మిణి సమేత రాధాకృష్ణ కళ్యాణం భక్తుల భగవన్నామ స్మరణ తో కన్నుల పండగ గా జరిగింది. కళ్యాణ విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించారు. అనంతరం అవధూతేంద్ర భక్తమండలి ఆధ్వర్యంలో యువకులు, చిన్నారులు మహిళలు పెద్ద సంఖ్యలో కోలాహలంగా ఉట్టికొట్టే వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో అర్చకులుసాయి, రామకృష్ణ ,బుజ్జయ్య, భక్త మండల అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ మహంకాళి రామ నర్సయ్య, విజయ, రఘుకుమార్, కేసగాని నాగయ్య, మోసం కృష్ణమూర్తి ,బండి శ్రీనివాస్, రవికుమార్, రమేష్, శ్రీనివాస్ ,తిరుపతిరావు ,రామారావు ,రాజేంద్రప్రసాద్ ,పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సలీం షరీఫ్ కు రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారం

- మూడు దశాబ్దాల అంకితభావానికి దక్కిన అరుదైన గౌరవం
- విద్యార్థుల విజయాలు.. పెరిగిన పాఠశాల ప్రతిష్ఠ.. సమాజ భాగస్వామ్యంతో అభివృద్ధికి బాటలు
- మూడు దశాబ్దాల విద్యా సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

**కోదాడ, సెప్టెంబర్ 4(భద్రాద్రి న్యూస్):** విద్యా రంగంలో దాదాపు మూడు దశాబ్దాలుగా అంకితభావంతో సేవలందిస్తూ, విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాల అభివృద్ధి, సమాజ భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణలో విశిష్ట కృషి చేసిన PM SHRI Z.P. హైస్కూల్, కోదాడ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ మహమ్మద్ సలీం షరీఫ్ గారికి రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారం లభించింది. 1996 నవంబర్ 27న ప్రభుత్వ సేవలో చేరిన ఆయన ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, వీజూ (ఖీూజ)గా వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు, పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. ఆయన నాయకత్వంలో పాఠశాల విద్యా ఫలితాల్లో విశేష పురోగతి సాధించింది. 2024--25లో 88 శాతం ూూజ ఫలితాలు, Advanced Supplementaryలో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏడుగురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించగా, ఒక విద్యార్థి 571 మార్కులతో జిల్లా్ూ. పాఠశాలల టాపర్‌గా నిలిచాడు. 2025--26లో 99 శాతం ూూజ ఫలితాలు, ూాఎఝుఅఎవఎ ూబజూజూశ్రీవఎవత్ఝుతీఎలో 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. 15 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించగా, 572 మార్కులు సాధించిన విద్యార్థి కోదాడ డివిజన్ టాపర్‌గా నిలిచాడు. పోటీ పరీక్షల్లోనూ విద్యార్థులు రాణించారు. 2025లో ముగ్గురు, 20**26లో నలుగురు విద్యార్థులు చీవీమీ స్కాలర్‌షిప్‌లు సాధించారు. 2025లో ఒకరు, 2026లో ముగ్గురు విద్యార్థులు IIIT** బాసరలో సీట్లు సాధించారు. ఇంటింటి ప్రచారం, బడిబాట, చదువుల పండుగ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల నమోదు, నిలుపుదలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో పాఠశాలలో కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య ప్రతి సంవత్సరం కనీసం 155 మందికి చేరగా, డ్రాప్‌అవుట్ లేకుండా చర్యలు చేపట్టారు. తక్కువ ఖర్చు/ఖర్చులేని బోధనా పద్ధతులు, ఆడియో--విజువల్ అభ్యసనం, ప్రత్యేక సహాయక బోధన, క్రీడలు, సాంస్కృతిక, సహపాఠ్య కార్యక్రమాలను ప్రోత్సహించారు. దాతలు, పూర్వ విద్యార్థులు, సమాజ సహకారంతో పాఠశాల మౌలిక వసతులను అభివృద్ధి చేశారు. 2002 మండల ఉత్తమ ఉపాధ్యాయ, 2007 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ, 2017, 2023 ఉత్తమ MEO, 2025 జిల్లా ఉత్తమ పాఠశాల పురస్కారాలతో పాటు పలు అవార్డులు ఆయన సేవలకు లభించాయి. మూడు దశాబ్దాల విద్యా సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపుగా లభించిన రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారం కోదాడ విద్యా రంగానికి గర్వకారణంగా నిలిచింది.



# బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ఘాటు సవాల్

- అబద్ధాల ప్రచారం మానండి.. దమ్మూంటే వైరా రింగ్ సెంటర్‌కు రండి
-- ప్రతి లెక్కా ప్రజల ముందు పెడతాం: పమ్మి అశోక్



**వైరా, సెప్టెంబర్ 4,( భద్రాద్రి న్యూస్):** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం పత్రికా సమావేశం నిర్వహించారు ఈ సమావేశం లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్ బిఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేసిన విమర్శలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు
“నిన్న కొనిజర్లలో కూర్చొని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టారాజ్యంగా మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, ఇప్పుడు అధికారం పోయిన తర్వాత మైకుల ముందు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది. మీరు విసిరిన సవాలును కాంగ్రెస్ పార్టీ స్వీకరిస్తోంది. దమ్మూంటే వైరా నియోజకవర్గ రింగ్ సెంటర్‌కు రండి.. మేము మా ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి వస్తాం. తడి బట్టలతో ప్రమాణం చేయడానికైనా సిద్ధం. మీరు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతాం.. ప్రతి లెక్కను ప్రజల ముందే పెడతాం” అని పమ్మి అశోక్ సవాల్ విసిరారు.

**రుణమాఫీపై మాట్లాడే ముందు బీఆర్ఎస్ తమ గతాన్ని గుర్తు చేసుకోవాలి :** “రైతు రుణమాఫీ గురించి మాట్లాడే ముందు బీఆర్ఎస్ నాయకులు తమ పదేళ్ల పాలనలో ఏం చేశారో గుర్తు చేసుకోవాలి. రూ.1 లక్ష రుణమాఫీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేక రైతులను బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిప్పిన చరిత్ర మీదే. రైతుల కన్నీళ్లకు కారణమైన మీరు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంది” అని ఆయన తీవ్రంగా విమర్శించారు. “కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల లోపు రైతు రుణమాఫీ అమలు చేసింది. దీనిపై మీకు అనుమానం ఉంటే రండి.. రైతుల దగ్గరకు తీసుకెళ్లి చూపిస్తాం. కాగితాల మీద కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవాలను చూపిస్తాం” అని అన్నారు.

**గోదావరి జలాలపై తప్పుడు ప్రచారం మానుకోవాలి**
వైరా నియోజకవర్గానికి గోదావరి జలాలు రాలేదంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను పమ్మి అశోక్ తీవ్రంగా ఖండించారు. “గోదావరి జలాలు రాలేదని చెప్పడం మీ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం. వైరా నియోజకవర్గానికి తలమానికమైన రిజర్వాయర్ వద్దకు రండి. గోదావరి జలాలు ఎలా వచ్చాయో, ఎక్కడికి చేరాయో ప్రత్యక్షంగా చూపిస్తాం. ప్రజలను తప్పుదోవ పట్టించే అబద్ధాల ప్రచారం ఇకనైనా ఆపండి” అని హెచ్చరించారు.

**అప్పుల కుప్పను మిగిల్చి.. ఇప్పుడు కాంగ్రెస్‌పై విమర్శలా?**
“బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టారు. లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టారు. ఆ అప్పులకు వడ్డీలు కడుతూ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తోంది. అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోంది. మీరు చేసిన అప్పులకు మేము వడ్డీలు కడుతూ, మీరు చేయలేని సంక్షేమాన్ని మేము చేస్తుంటే.. మాపై విమర్శలు చేయడానికి మీకు సిగ్గు ఉండాలి” అని పమ్మి అశోక్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

**3650 రోజులు అధికారంలో ఉండి ఏం చేశారు?**
“దాదాపు 3650 రోజులు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో రాష్ట్ర ప్రజలకు తెలుసు. పదేళ్ల పాలనలో చేయలేనివి కాంగ్రెస్ 1000 రోజుల్లో చేయగలిగితే.. మీ పదేళ్ల పాలనకు, మా 1000 రోజుల పాలనకు తేడా ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోంది” అని అన్నారు. “అధికారం ఉన్నప్పుడు ప్రజల సమస్యలు కనిపించలేదు. ఇప్పుడు అధికారం పోయిన తర్వాత ప్రతి విషయంపై మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. ప్రజలు మీ మాటలను నమ్మే రోజులు ఎప్పుడో పోయాయి. ఎన్నికల్లో ఎందుకు మిమ్మల్ని తిరస్కరించారో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోండి” అని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.

**బురద చల్లాలని చూస్తే.. నిజాలు బయటపెడతాం**
“కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంత బురద చల్లాలని చూసినా అది మీ చేతులకే అంటుకుంటుంది. ఎందుకంటే ప్రజలు వాస్తవాలను చూస్తున్నారు. సోషల్ మీడియాలోనో, సభల్లోనో ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజల కళ్లను మోసం చేయలేరు” అని పమ్మి అశోక్ అన్నారు. “ఇక మైకుల ముందు సవాళ్లు విసరడం కాదు.. తేదీ, సమయం చెప్పి వైరా రింగ్ సెంటర్‌కు రండి. మేము సిద్ధంగా ఉన్నాం. మా ఎమ్మెల్యేలు, మంత్రులను తీసుకొస్తాం. మీరు అడిగిన ప్రతి అంశంపై ఆధారాలతో సమాధానం చెబుతాం. మీ పాలనలో ఏం జరిగింది.. కాంగ్రెస్ పాలనలో ఏం జరుగుతుందో ప్రజల మధ్యలోనే తేల్చుకుందాం” అని ఆయన సవాల్ విసిరారు.
“బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా చవకబారు రాజకీయాలు, అబద్ధాల ప్రచారం మానుకోవాలి. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఇక సాగవు. వైరా ప్రజలు ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు మాటలు మాత్రమే చెబుతున్నారో ఇప్పటికే గుర్తించారు. ప్రజల తీర్పును గౌరవించి వాస్తవాలు మాట్లాడటం నేర్చుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచిస్తున్నాం” అని పమ్మి అశోక్ స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకుల డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళి కృష్ణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పణితి శ్రీనివాస్ రావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కొట్టే రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వంకుడోతూ భిక్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బీడీకే రత్నం, అష్టగుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు పటేల్, తెళ్ళురి వీరయ్య, తోటకూర శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు....

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా సపావట్ కిషన్

- టేకులతండా గిరిజన సంక్షేమ పాఠశాల కు అరుదైన గౌరవం
- అంకితభావంతో విద్యాసేవలు అందించినందుకు గుర్తింపు



**కామేపల్లి, సెప్టెంబరు 4(భద్రాద్రి న్యూస్):-**
గిరిజన సంక్షేమ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి పునాది వేస్తూ గ్రామాభివృద్ధిలో భాగస్వామిగా నిలిచిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సపావట్ కిషన్ “ఎంఏ బీఈడీ” ప్రతిష్ఠాత్మక తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. కామేపల్లి మండలం టేకులతండా జీపీఎస్ పాఠశాలలో సేవలు అందిస్తున్న ఆయనను ప్రభుత్వం ఈ పురస్కారానికి ఎంపిక చేసింది.

**?విద్యార్థుల భవిష్యత్తే ధ్యేయంగా..**
స్థానికంగానే నివాసముంటూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ నేర్పించడంలో కిషన్ ప్రత్యేక ముద్ర వేశారు. ఐటీడీఏ చరిత్రలోనే తొలిసారిగా జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీశారు. వెనుకబడిన పిల్లలకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారి విజయంలో కీలక పాత్ర పోషించారు.

**?బడి రూపురేఖలు మార్చి..**
విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో తాజా కూరగాయలు అందించేందుకు పాఠశాలలో కిచెన్ గార్డెన్‌తో పాటు మోడల్ కిచెన్ షెడ్డును నిర్మించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా పూలు, పండ్ల తోటలు పెంచి బడిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆయన నిరంతర శ్రమతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గ ణ నీ య ం గా పెరిగింది.





**?ప్రభుత్వ బడికే పంపించండి: సపావట్ కిషన్**
అవార్డుకు ఎంపికైన సందర్భంగా కిషన్ హర్షం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులకు కీలక విజ్ఞప్తి చేశారు. “మీ పిల్లలను మన ప్రభుత్వ బడికే పంపించండి. చక్కటి క్రమశిక్షణ, విద్య, పరిశుభ్రమైన భోజనం, సురక్షిత నీరు అందించే బాధ్యత నాది. ప్రైవేట్ పాఠశాలలకు చేసే ఖర్చును పిల్లల ఖాతాల్లో పొదుపు చేస్తే వారి భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది అని పేర్కొన్నారు.

# అంగన్వాడీలకు ప్రభుత్వం రూ.26 వేల వేతనం చెల్లించాలి

- ఐఎఫ్టియు జనరల్ బాడీ సమావేశంలో నాయకుల డిమాండ్

**కామేపల్లి,సెప్టెంబర్ 4(భద్రాద్రి న్యూస్):**-కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కార్యకర్తల పట్ల సవతి తల్లి ప్రేమను వలకబోస్తున్నాయని, తక్షణమే సమాన పనికి సమాన వేతనం కింద రూ.26,000 చెల్లించాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి బి. భాస్కర్,భారత కార్మిక సంఘాల సమైక్య రాష్ట్ర సహాయ కార్యదర్శి కందగట్ల సురేందర్ డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం లోని కొత్త లింగాల క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రగతిశీల అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు.





?సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మొబైల్ యాప్ లను రద్దు చేయాలని, పెన్షన్, భవిష్య నిధి, వైద్య సౌకర్యాలు కల్పించడంతో పాటు విరమణ పొందిన వారికి రావలసిన ప్రయోజనాలను వెంటనే జమ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి పని గంటలను పెంచడాన్ని ఖండించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తాతా సత్యనారాయణ, ఉమా, కవిత, సుగుణ, ఉమాశంకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మార్పీఎస్ మునుగోడు నూతన మండల కమిటీ ఎన్నిక

**మునుగోడు సెప్టెంబర్ 04 ( భద్రాద్రి న్యూస్):**
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారికి ఆదేశాల మేరకు మత దురంహకారం కుల వివక్షత సాఫీక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం జరిగే కర్తవ్య నిర్వహణకై జాతిని సమగ్ర అభివృద్ధి వైపు నడిపించే దిశగా క్షేత్రస్థాయిలో ఎమ్మార్పీఎస్ కమిటీల పునర్నిర్మాణం ఏర్పాటు చేయుటలో భాగంగా ఈరోజు నల్లగొండ జిల్లా మునుగోడు మండల ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ ఎన్నిక సమావేశం స్థానిక జగ్జీవన్ రాం భవన్ లో సీనియర్ నాయకులు పందుల మల్లేష్ మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మీరా రాష్ట్ర నాయకులు కొమిరే స్వామి మాదిగ,వీరా తాజా మాజీ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ గార్లు హాజరై మాట్లాడుతూ...ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ సాధించిన అనంతరం ఎమ్మార్పీఎస్ జాతీయ స్థాయిలో మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో మాదిగల పేదరిక నిర్మూలన కోసం అదేవిధంగా సామాజిక,ఆర్థిక,రాజకీయ అసమానతలు లేని వ్యవస్థ కోసం భవిష్యత్తు పోరాటం కొనసాగుతుందని తెలిపారు ఈ పోరాటానికి మాదిగలు మరింత శక్తివంతంగా సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నుకున్నారు. అక్టోబర్ 7న అమరావతిలో జరగబోవు జాతీయ సదస్సు కు తరలి రావాలని పిలుపునిచ్చారు.
ఎమ్మార్పీఎస్ మండల కమిటీ వివరాలు...



అధ్యక్షులుగా: నందిపాటి కృష్ణ మాదిగ
అధికార ప్రతినిధి:- దుబ్బ రవి మాదిగ
ప్రధాన కార్యదర్శిగా:- దర్శనం నాని మాదిగ
ఉపాధ్యక్షులు: - పందులవెంకన్న మాదిగ
ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దుబ్బ గోపాల్ మాదిగ పగడాల నాగయ్య మాదిగ దుబ్బ భాస్కర్ మాదిగ బోయపర్తి యాదయ్య మాదిగ గాదపాక ప్రభాకర్ మాదిగ బోయపర్తి సురేంద్ర మాదిగ నరసింహ మాదిగ సుధాకర్ మాదిగ శ్రీకాంత్ మాదిగ సైదులు మాదిగ రాములు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ రెండు మొక్కలు.. పచ్చదనంతో గాదేపాడు

**- పర్యావరణ పరిరక్షణకు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ వినూత్న చర్య**

**గాదేపాడు, సెప్టెంబర్ 4, (భద్రాద్రి న్యూస్ రాములు ):**
పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో గాదేపాడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతి ఇంటికీ రెండు మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి ఒక పూల మొక్క, ఒక గానుగ మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి కుటుంబం ఇంటి ఆవరణలో రెండు మొక్కలను నాటి వాటిని సంరక్షించి పెంచాలని కోరారు. మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించినప్పుడే గ్రామం పచ్చదనంతో కళకళలాడుతుందని తెలిపారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భావించాలని సర్పంచ్ సూచించారు. గాదేపాడు గ్రామపంచాయతీని పచ్చదనం, పరిశుభ్రతలో ఆదర్శ గ్రామపంచాయతీగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కె. కెవ్వులియా, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు మొక్కలను అందజేసి, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు.



# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కారేపల్లిలో బీఆర్ఎస్ సమరశంఖం!

**- కార్యకర్తలతో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ.. వంటా-వార్పుతో నిరసన**
**- 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలు అమలు చేయాలి: బీఆర్ఎస్ నాయకుల డిమాండ్**

**కారేపల్లి, సెప్టెంబర్ 4, (భద్రాద్రి న్యూస్ రాములు ):**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన నేపథ్యంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కారేపల్లి మండలంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ చేపట్టిన '1000 రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై పోరుబాట' కార్యక్రమంలో భాగంగా కారేపల్లి క్రాస్‌రోడ్ వద్ద ఆందోళన చేపట్టారు.బీఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి నాయకత్వంలో కారేపల్లి నుంచి కారేపల్లి క్రాస్‌రోడ్ వరకు కార్యకర్తలు భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్రాస్‌రోడ్ వద్ద వంటా-వార్పు చేపట్టి ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. మహిళలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శాసనమండలి సభ్యుడు తాతా మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.





**మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి: ఆర్.జె.సి. కృష్ణ**
బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.జె.సి. కృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500, విద్యార్థినులకు స్కూటీలు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం, అర్హులందరికీ ఇళ్లు, పెన్షన్ల పెంపు వంటి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.
**బీఆర్ఎస్ పోరాటంతోనే ప్రజా సంక్షేమం గుర్తొస్తోంది: చంద్రావతి**
మాజీ వైరా నియోజకవర్గ శాసనసభ్యురాలు చంద్రావతి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లోకి వచ్చి పోరాటాలు ప్రారంభిస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు, ప్రజల సంక్షేమం గుర్తుకు వస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.
**హామీలు పూర్తిగా అమలు చేసే వరకు పోరాటం: మనీషా లక్ష్మి**
బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మాట్లాడుతూ.. 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని తెలిపారు. బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎప్పటికీ ప్రజల పక్షాన నిలుస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు నియమితులైన ఇంగువ రామకృష్ణ గారికి.. హర్షం వ్యక్తం చేసిన. బిజెపి నేతలు

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 4 (భద్రాద్రి న్యూస్):**
భారతీయ జనత పార్టీ నేలకొండపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నేలకొండపల్లి గ్రామానికి చెందిన ఇంగువ రామకృష్ణ గారికి అఖిలభారత బ్రాహ్మణ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులుగా నేలకొండపల్లి గ్రామానికి చెందిన ఇంగవ రామకృష్ణ గారిని ఎంపిక చేయడం పట్ల భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండలం కమిటీ ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూవ మోర్చా ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు అనంత ఉపేందర్ గౌడ్, మరియు దళిత మోర్చా ఖమ్మం జిల్లా కార్యదర్శి కొమరబత్తిని వెంకన్న, హాజరు కావడం జరిగింది ఈ కార్యక్రమానికి బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు గోవిందరావు బాజా రామకృష్ణ ఉపాధ్యక్షులు పురాణం దివాకర్ కొండ హర్షవర్ధన్ కిసాన్ మోర్చా మండల నాయకులు సూరేపల్లి జ్ఞానరత్న ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పిట్టల సూరిబాబు బిజెపి సోషల్ మీడియా మండల ఇంచార్జి కందరబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు

# వైద్య విద్యలో సీటు సాధించిన కిషోర్ నాయక్‌కు అభినందనల వెల్లువ

**- నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం**
**- గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలి: సర్పంచ్ బానోత్ హీరాలాల్**

**భాగ్యనగర్ తండా, సెప్టెంబర్ 4, (భద్రాద్రి న్యూస్ రాములు ):**
భాగ్యనగర్ తండా 10వ వార్డు సభ్యురాలు గుగులోత్ జ్యోతి--రాములు దంపతుల ద్వితీయ కుమారుడు గుగులోత్ కిషోర్ నాయక్ వైద్య విద్యలో ప్రవేశం సాధించిన సందర్భంగా గ్రామంలో అభినందనలు వెల్లువెత్తాయి. నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ వైద్య విద్యను అభ్యసించేందుకు ప్రవేశం పొందిన కిషోర్ నాయక్‌ను భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, ఇష్టపడి చదువుతూ ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలని కిషోర్ నాయక్‌కు సూచించారు. వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పిల్లలను ఉన్నతంగా చదివించేందుకు కష్టపడుతున్న తల్లిదండ్రులు జ్యోతి--రాములు దంపతులను సర్పంచ్ అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుంచి విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. కిషోర్ నాయక్ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ భిక్కులాల్, వార్డు సభ్యులు గాంధీ, పద్మ, సుమ, మహేష్, భూలి, సంధ్య, నగేష్, కిషన్, దేవి, అంకి, మాజీ ఎంపీటీసీ రాంచందర్, జిల్లా నాయకులు గుగులోత్ భీముడు, గుగులోత్ మోతిలాల్ (జీఎం), యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్, మండల నాయకుడు భగవాన్ దాస్ తదితరులు కిషోర్ నాయక్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులు సైతం కిషోర్ నాయక్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వైద్య రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



## అడవి మద్దులపల్లిలో గిరిజనులకు మౌలిక వసతులు కల్పించాలి

**-- బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు జాల శ్రీను**



**కామేపల్లి,సెప్టెంబర్ 4(భద్రాద్రి న్యూస్):** మండలంలోని అడవి మద్దులపల్లి గ్రామంలో గిరిజనులకు వెంటనే మౌలిక వసతులు కల్పించాలని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు జాలే శ్రీను యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలను ను ఆయన కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సుమారు 50 గిరిజన కుటుంబాలు, 200 మంది ఓటర్లు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గత 20 ఏళ్లుగా పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు మారినా తమ తలరాతలు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అడవి మద్దులపల్లి గ్రామంలో సరైన రహదారి సౌకర్యం లేక, తాగునీరు, విద్యుత్, విద్య మరియు వైద్య సదుపాయాలు అందక స్థానికులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు తరలించేందుకు 108 అంబులెన్స్ సేవలు కూడా లభించని స్థితిలో ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. ?ఇటీవల అనారోగ్యంతో అత్యవసర పరిస్థితిలో ఉన్న నందిని అనే చిన్నారితో పాటు శివ అనే యువకుడికి తక్షణమే రక్తం దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. గిరిజన గ్రామాల సమస్యలను త్వరలోనే జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్తానని, గ్రామానికి తక్షణమే రహదారులు, విద్యుత్, మంచినీరు, వైద్య సదుపాయాలు సమకూరేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఏడకడుతూ ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**-- కొత్త లింగాలలో బిఆర్ఎస్ నిరసన ప్రదర్శన 'వంటా-వార్పు'**





**కామేపల్లి,సెప్టెంబర్ 4(భద్రాద్రి న్యూస్):** ప్రజా సమస్యలను గాలికి వదిలి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి నాయకులు కార్యకర్తలు తీసుకెళ్లాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్సీ తాత మధు సూదన్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనా వైఫల్యాలను నిరసిస్తూ శుక్రవారం మండలంలోని కొత్త లింగాల గ్రామంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున 'వంటావార్పు' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలు 420 గా మిగిలిపోయాయని కాంగ్రెస్ పాలకులు అలవి కానీ హామీలు ఇచ్చి ప్రజలనుండీ తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటుందని ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలు విసుగు పోయి ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పాలకలను అడుగడుగునా నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అంతోటి అచ్చయ్య సర్పంచులు జాటోత్ లూసి, ధరావత్ నాగమణి ధారావత్ నాగమణి,మలోత్ కిషన్ నాయక్,పడిగ నాగమణి, కామేపల్లి సొసైటీ మాజీ చైర్మన్ తీర్థాల చిదంబర రావు, మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లెంపాటి శ్రీనివాస రావు, సతాకోటి హనుమంతరావు, ఒడియాల కృష్ణారెడ్డి, సామ మోహన్ రెడ్డి, కాట్రాల రాంబాబు, ఆదూరి ప్రసాద్ చిప్పలపల్లి శ్రీనువాస్ రాయల చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**గుండాల, సెప్టెంబర్ 4 భద్రాద్రి న్యూస్:** మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు తదితర వేషధారణలో సందడి చేశారు. నెమలి పింఛాలు, వేణువులు, సంప్రదాయ దుస్తులతో చిన్నారులను అందంగా అలంకరించడంతో వేడుకలకు ప్రత్యేక శోభ సంతరించుకుంది. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, కృష్ణుడి లీలలను తలపించేలా చేసిన అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారుల వేషధారణను చూసిన తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారులతో కలిసి ఫొటోలు దిగుతూ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలతో మండల కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.





Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046